**తిరుమల,డిసెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలకు వచ్చిన భక్తులకు నిరంతరాయంగా అక్షయపాత్రలా రుచి,శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు విలువైన డిడిలను అందజేశారు. తమిళనాడు చెన్నై గ్రీన్ డేజిల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత సెంధిల్‌కుమార్ ఈ విరాళాల డిడిలను ఎసి అన్నప్రసాదం ఎఇఓ గోపీనాథ్‌కు అందించారు. భక్తులకు మరింతగా ఉచిత అన్నప్రసాదం అందించేందుకు తనవంతు విరాళమిచ్చినట్లు దాత తెలిపారు.

---

## వెంకన్నకు రూ.1.30కోట్ల బంగారు ఆభరణాలు బహూకరణ



**తిరుమల, డిసెంబరు 29ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు శ్రీవేంకటేశ్వరస్వామికి దాతలు తమవంతుగా, శక్తికొద్దీ మొక్కుబడుల్లో భారీగా బంగారు, వెండి ఆభరణాలు, నగదు చెల్లించుకుంటున్నారు. ధనుర్మాసంలో గురువారం ఉదయం తిరుపతి,చిత్తూరునగరాల్లోని కెవిఆర్ జ్యువలర్స్ వ్యవస్థాపకుడు కెఆర్ నారాయణమూర్తి, కెవన్ స్వర్ణగౌరి కుటుంబసభ్యులు 1.30కోట్ల రూపాయలు విలువైన 1756గ్రాముల బంగారు ఆభరణాలను వెంకన్నకు సమర్పించుకున్నారు. విరాళాల రూపంలో కానుకలుగా ఇచ్చిన బంగారు ఆభరణాల్లో మూలవిరాట్ కోసం జత కర్ణాభరణాలు, మలయప్ప స్వామికి యజ్ఞోపవీతం, శ్రీదేవి భూదేవిసమేత మలయప్పస్వామికి రాళ్ల పొదిగిన మూడు పతకాలు కానుకగాఅందించారు. ఈ ఆభరణాలను గురువారం ఉదయం తిరుమలేశుని ఆలయంలోని రంగనాయకుల మండపంలో దాతలు కెఆర్ నారాయణమూర్తి, కెవన్ స్వర్ణగౌరి టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి ఇఓ అనిల్ కుమార్ సింఘాల్‌కు అందజేశారు. గతంలో ఈ దాతలు గత ఏడాది డిసెంబర్‌లో 3కోట్ల రూపాయలు విలువైన కటి, వరద హస్తాలను శ్రీవారికి కానుకగా సమర్పించుకున్నారు.

---

# ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం

## ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మండిపాటు

**తాడేపల్లిగూడెం, డిసెంబరు 29,ప్రభాతవార్త:** తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం అలవాటుగా మారిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ,ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన రైస్ కార్డులు పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. నాడు గోదావరి పుష్కరాలకు రాజమండ్రిలో జరిగిన దుర్ఘటనకు, తర్వాత భవానీ ద్వీపం, ఇపుడు కందుకూరు...ఇలా ఎక్కడ చూసినా చంద్రబాబు ప్రచార ఆర్భాటానికి అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ధ్వజమెత్తారు. 2015లో గోదావరి పుష్కరాలకు రాజమండ్రిలో విఐపి ఘాట్ ఉండగా అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అక్కడ పుష్కర స్నానం ఆచరించకుండా పుష్కర ఘాట్‌కు రావడం, జనాన్ని వెళ్లనివ్వకుండా గేట్లు వేసి ఆపేయడం, దర్శకుడు బోయపాటి శ్రీను డైరెక్షన్‌లో జనం క్రౌడ్‌ను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించడం కోసం ఒకేసారి జనాన్ని వదలడంతో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఉప ముఖ్యమంత్రి కొట్టు ఆనాటి దుర్ఘటనను గుర్తు చేశారు. ఆ తర్వాత భవానీ ద్వీపంలోను ప్రమాదం జరిగి పది మందికి పైగా చనిపోవడానికి చంద్రబాబే పరోక్ష కారణమని ఆరోపించారు. అలాగే ఇపుడు కందుకూరులో ఇరుకు ప్రదేశంలో సభ పెట్టి జనం తొక్కిసలాట జరిగి 8 మంది చనిపోవడానికి చంద్రబాబు కారకులయ్యారని ఆయన మండిపడ్డారు. జనం ఎక్కువ వచ్చినట్లుగా చూపించుకోవడానికి ఇరుకు ప్రదేశాల్లో సభలు పెట్టడం, డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి లేనిది ఉన్నట్లుగా చూపించడంవంటి పబ్లిసిటీ పిచ్చితో చంద్రబాబు ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు తన పర్యటనలు, సభలు మానుకుని ఇంట్లో కూర్చుంటే రాష్ట్ర ప్రజలు సుఖంగా, సంతోషంగా ఉంటారని, అందరి ప్రాణాలను కాపాడినవారవుతారన్నారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేసి కొత్తవి ఇస్తుంటే పాతవాటిని తీసివేస్తామని తెలుగుదేశం దుష్ప్రచారం చేస్తోందని కొట్టి పారేసారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా 35 లక్షలుఉన్న పెన్షన్లు నేడు వైఎస్సార్సీ ప్రభుత్వంలో 65 లక్షలకు చేరాయన్నారు. ప్రతీ నెలా ఒకటో తారీకున తెల్లవారక ముందే వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నారన్నారు. శిశుపాలుడు వంద తప్పులు చేసిన మాదిరిగా చంద్రబాబు అనేక తప్పులు చేస్తున్నారని, 2019 ఎన్నికల్లోనే ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా గుణపాఠం రాలేదన్నారు. మరోసారి పరాభవానికి సిగ్గు లేకుండా సిద్ధపడుతున్నారని విమర్శించారు. మారీచుడిలా వేషాలు మార్చి ఏమార్చడానికి తయారవుతున్నారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి పవన్ కళ్యాణ్ జనసేనపార్టీని పెట్టారని ఎద్దేవాచేశారు. ఎప్పటికీ ధర్మమే గెలుస్తుందని, పేదల బాగు కోసం ధర్మపాలన సాగిస్తున్న వైకాపాకు, ముఖ్యమంత్రి జగన్ కు ఎదురే లేదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.

---

# అరుదైన రికార్డు సాధించిన కృష్ణపట్నం పోర్టు

## 168100 టన్నుల ఇనుప ఖనిజాన్ని కేప్ సైజర్ షిప్‌ద్వారా తరలింపు

**ముత్తుకూరు(నెల్లూరు) డిసెంబరు29 ప్రభాతవార్త:** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలంలో ఏర్పాటుచేసి కృష్ణపట్నం ఓడరేవు భారతదేశ సముద్ర పరిశ్రమ మెత్తంలో ఇప్పటివరకు నమోదు కాని రికార్టును సృష్టించి అరుదైన మైలురాయిని సొంతం చేసుకుంది. ఈనెల 28వ తేదీన దశంలోనే మెట్టమెదటి సారిగా గరిష్టంగా 17.85 మీటర్ల డ్రాఫ్‌తో పూర్తిగా లోడ్ చేయడిన కేప్ సైజర్ షిప్ 168100ఎంటి టన్నుల ఇనుప ఖనిజాన్ని లోడ్ చేసుకుని కృష్ణపట్నం ఓడరేవునుండి బయలుదేరింది.ఈ లోడ్ ఇప్పటి వరకు అత్యంత లోతైన డ్రాఫ్ట్ ఇదే కావటం విశేషం.అలాగే ఎంవి ఎన్ఎస్ హైరున్ డిసెంబరు 23న సురక్షితమైన బెర్తుకోసం యుక్తి ప్రణాళికతో రూపొందించిన తర్వాత 17.85 మీటర్ల డ్రాఫ్ 168100ఎండి ఐరన్‌ఓర్ లోడ్‌లో ప్రయానించిన తరువాత బెర్తు చేయటం జరిగింది.

ఈ ఆపరేషన్‌లో ఎన్‌పి కెప్టెన్ పాధి, పెప్టెన్ బిబూపాద సాహూ, నిపుణుల మార్గదర్శకాల్లో సిఈఓ జిజె రావు, కోమిస్టర్ సంజోయ్‌కోధా లు నిబద్ధతతో వ్యవహరించారు.అసాధ్యమైన ఈ ల్యాండ్‌మార్కును కృష్ణపట్నం పోర్టు సాధించటం ద్వారా దేశంలోని అన్నీ ఓడరేవులకంటే అగ్రస్తానంలో కృష్ణపట్నం నిలించింది. ది బిగెస్టు పోర్ట్ ఆన్ ది హూరిజోన్ పోర్టు పేరును కృష్ణపట్నం ఈ ఘటనతో సార్ధకం చేసుకుంది. కృష్ణపట్నం పోర్టును ఆపరేట్ చేస్తున్న ఆదానీ పోర్ట్ లాజిస్టిక్స్‌కు కూడా ఈ ఘనత దక్కుతుంది.

---

# అతిపెద్ద పోలీసు జిల్లాగా తిరుపతి



## జిల్లాలో 26 సారారహిత గ్రామాలుగా మార్పు

### ఫోక్సోకేసులో నిందితుడికి జీవితఖైదు

**తిరుపతి, డిసెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో నూతన జిల్లాల ఏర్పాటుతో అతిపెద్ద పోలీసు జిల్లాగా తిరుపతి ప్రత్యేకతను సంతరించుకుంది. అర్బన్‌పోలీసు జిల్లాగా ఉన్న సమయంలో 24 పోలీసు స్టేషన్‌లతో ప్రజలకు సేవలందించేవారు. ఇప్పుడు ఏకంగా 52 పోలీస్ స్టేషన్‌లతో అతిపెద్ద పోలీస ౹జిల్లాగా అవతరించింది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో 9 సబ్‌డివిజన్లు, 53 పోలీస్‌స్టేషన్‌లతో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలనియంత్రణ, ప్రముఖుల భద్రత తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా కలియుగ ప్రత్యక్షదైవమ్ ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రం, జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీకాళహస్తి క్షేత్రం, తిరుచానూరు, నారాయణవనం, నాగలాపురం, శ్రీనివాసమంగాపురం పుణ్యక్షేత్రాలుతోబాటు దేశానికి తలమానికమైన శ్రీహరికోట అంతరిక్ష రాకెట్ కేంద్రం, శ్రీసిటీ, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలతో అలరారుతోంది. ఐదు విశ్వవిద్యాలయలతో అనేక కళాశాలలతో ప్రముఖ విద్యాకేంద్రంగా భాసిల్లుతోంది. రోజూ వేలాదిమంది వైద్యసదుపాయాల కోసం రాయలసీమ జిల్లాలనుండేగాక నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజలు తిరుపతి స్విమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, రూయా ఆస్పత్రి, బర్డ్ ఆస్పత్రి,అనేక కార్పొరేట్ ఆస్పత్రులకు వైద్యం కోసం ప్రజలు వస్తున్నారు. తిరుపతి,తిరుమలకువచ్చే లక్షలాదిమంది యాత్రికులుకు భద్రత, ఆస్తులకు రక్షణలో తిరుపతి జిల్లా పోలీసుల పనితీరు ప్రత్యేకం. 2022 సంవత్సరంలో తిరుపతి జిల్లాలో నేరాలు శాతం, రికవరీ, భద్రత, ప్రత్యేక పర్వదినాల్లో, ముఖ్యమైన రోజుల్లో పోలీసుల పనితీరు తదితర వాటిపై గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, సెబ్ జెడి రాజేంద్ర, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి స్వాతి తదితరులతో కలసి మీడియాప్రతినిధులకు వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లాలో మహిళలపై జరిగే నేరాలను మహిళలే వెలుగులోకి తెస్తున్నారని ఎస్‌పి చెప్పారు.

శాంతిభద్రతలు అదుపులో ఉంచడమే ధ్యేయంగా, నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ,ప్రముఖుల ,ప్రజల భద్రతలో సమిష్టిగా పనిచేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయగలిగారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర ముఖ్యమంత్రితోబాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు,రాష్ట్ర గవర్నర్‌లు పర్యటన సమయాల్లో మరింత అదనపు డ్యూటీలతో బందోబస్తు నిర్వహించి ప్రశాంతంగా పర్యటన ముగించేలా చూశామన్నారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా పరిధిలో నాటుసారా తయారుచేసే జీవనాధారంతో బ్రతుకుతున్న 32 గ్రామాల్లో 26 గ్రామాల్లో మార్పు తీసుకువచ్చామన్నారు. ఈ గ్రామాల్లోని ప్రజలు సారా తయారీపై గాకుండా జీవనోపాధి కల్పించే పనులపై దృష్టి సారించేలా పలు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు.

---

# జనవరి 2న మళ్లీ భక్తుల సేవకు!

## ఇఓగా ధర్మారెడ్డి మలివిడత బాధ్యతలు

**తిరుమల, డిసెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఇఓ ఎవి ధర్మారెడ్డి సెలవు ముగించుకుని తిరిగి 2023 జనవరి 2వతేదీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ప్రస్తుతం కుటుంబంలో జరిగిన పుత్రశోకంతో 12రోజులు వ్యక్తిగత సెలవులో ఉన్నారు. ఆయన సెలవులు ముగించుకుని జనవరి 2వతేదీ తిరిగి యధావిధిగా పూర్తి స్థాయిలో ఇఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2వతేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినంనుంచి పదిరోజులు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తున్న విషయం విదితమే. ఈ పదిరోజులు ఆయన అటు భక్తులకు ఇటు టిటిడి ఉద్యోగులకు వారి కుటుంబసభ్యులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడంపై చర్యలు తీసుకుంటారు.

---

# శివయ్య సేవలో అశ్వనినాచప్ప




**శ్రీకాళహస్తి, డిసెంబరు 29 ప్రభాతవార్త:** దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి గాంచిన అథ్లెటిక్స్ క్రీడాకారిణి,నటి ఆశ్వని నాచప్ప గురువారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఆమెతో పాటు క్రికెట్ దిగ్గజం శ్రీకాంత్ కృష్ణమాచారి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన ప్రతిసారి ఆశ్వని నాచప్ప శ్రీకాళహస్తీశ్వరుని సేవకు వస్తారు.ఈ నేపధ్యంలో గురువారం ఆమె వచ్చారు. ఆమెకు ఆలయ మర్యాదలతో ఆలయాధికారి వికె సాగర్ బాబు సారధ్యంలో ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేద పండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఇఓ వికె సాగర్‌బాబు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

---

# ఉద్యోగుల పట్ల వివక్ష చూపొద్దు!

## వైకుంఠ ఏకాదశిన దర్శన భాగ్యం కల్పించండి

### టిటిడి ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ


**తిరుపతి, డిసెంబరు 29 ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ద్వార దర్శనాల్లో భాగంగా జనవరి 2వతేదీ వైకుంఠ ఏకాదశి, 3నద్వాదశి పర్వదినాల్లో దర్శనం కల్పించే రోజుల్లో టిటిడి ఉద్యోగులు వారి కుటుంబసభ్యులకు వైకుంఠ ఏకాదశిన దర్శనం కల్పించేవారని, అయితే ఈసారి ఏకాదశిన దర్శనం కల్పించకపోగా ఉన్న దర్శన సౌకర్యాలను తొలగించి, రేషన్ విధానంలో రోజూ 2వేలమందిని పంపుతామని సర్క్యులర్ ఇవ్వడం మంచిదికాదని ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. రెండురోజుల వైకుంఠ ద్వార దర్శనం అనుమతించే రోజుల్లో ఉద్యోగులకు మహాద్వారం నుండి దర్శన సౌకర్యం ఉండేదని, అలాగే కుటుంబసభ్యులకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనం సమయంలో నిత్యం పంపించేవారని పేర్కొన్నారు. ఆసౌకర్యం తొలగించి ఉద్యోగి రెఫరల్‌పై రెండు సార్లు 10మందికి అవకాశం ఉండేదన్నారు. గతంలో ఉన్న విధానాలను తిరిగి యధావిధిగా కొనసాగించి , జారీ చేసిన సర్క్యులర్‌లో మార్పులుచేసి ఉద్యోగులకు వారి కుటుంబసభ్యులకు, రెఫరల్‌పై బంధువులుకు, స్నేహితులకు దర్శనాలు కల్పించాలని టిటిడి ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్, నాయకులు కంపల వెంకటరమణారెడ్డి, గోల్కొండ వెంకటేశం, ఎం.నాగార్జున, ఎస్.కల్పన, కె.ఇందిరా,ఎం.ప్రసాద్‌రావు,జె.భాస్కర్, గుణశేఖర్, రత్నప్రభాకర్, వెంకటరమణ, కృష్ణమూర్తి ,రెడ్డప్ప తదితరులు డిమాండ్ చేశారు.


విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు

# వార్త

శుక్రవారం 30 డిసెంబర్ 2022





## నూతనంగా ఎంపికైన గ్రామ వార్డు సచివాలయం కన్వీనర్ల సమావేశం

విశాఖపట్నం, డిసెంబర్ 29, ప్రభాతవార్త

అచ్చుతాపురం మండలంలో వున్న సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు, నూతనంగా ఎంపికైన గ్రామ వార్డు సచివాలయం కన్వీనర్లకు సమావేశం అచ్చుతాపురం, పోలీస్ స్టేషన్ గ్రౌండ్ నందు నిర్వహించడమైదని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎలమంచిలి నియోజకవర్గం శాసనసభ్యులు యువి రమణమూర్తి రాజు (కన్నబాబు), రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేటి ప్రసాద్ యలమంచిలి నియోజకవర్గం అబ్జరవ్వర్ రొంగలి జగన్నాధం పాల్గొన్నారు. ఈ సమావేశం గ్రామ వార్డు సచివలయ కన్వీనర్లులకు దిశ నిర్దేశం చేయడమైనది ఈ కార్యక్రమంలో అచ్చుతాపురం మండలం ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన

# మంత్రి అమర్నాథ్

అనకాపల్లి/నర్సీపట్నం, డిసెంబర్ 29, ప్రభాతవార్త

నర్సీపట్నంలో నిర్మించతలపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి శుక్రవారం నర్సీపట్నం వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతమ్మ, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల కో-ఆర్డినేటర్ తలసిల రఘురాం, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, కలెక్టర్ రవి పటాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి శాలి తదితరులు పరిశీలించారు. నర్సీపట్నంలోని జోగినాధునిపాలెంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సభా ప్రాంగణాన్ని బలిఘట్టం బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను వీరు సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులకు మంత్రి అమర్నాథ్ కొన్ని సూచనలు ఇచ్చారు.

## కారుణ్య నియామకాలు పొందిన వారు

# అంకిత భావంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున



విశాఖపట్నం, డిసెంబర్ 29 ప్రభాతవార్త

కారుణ్య నియామకాలు పొందిన వారు అంకిత భావంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున తెలిపారు. గురువారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టీసీలో విధులు నిర వ్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 37 మందికి గ్రామ, వార్డు సచివాలయాల్లో జిల్లా కలెక్టర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియామకాలు పొందిన వారందరూ క్రమ శిక్షణతో పనిచేసి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ నియామకాలు పొందిన ప్రతి ఒక్కరూ వారికి ఇచ్చిన లక్ష్యాలతో ప్రగతి సాధించాలని, విధి నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అనంతరం ఎపిఎస్ఆర్టీసీ అసోసియేషన్ వారు జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, డిఆర్వో శ్రీనివాసమూర్తి, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి అధికారి పూర్ణిమా దేవి, ఎపిఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, రీజనల్ మేనేజర్ అప్పలరాజు, జిల్లా పంచాయితీ అధికారి అప్పలరాజు, పంచాయితీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీంద్ర, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటుంది

**-కందుకూరు రోడ్డు షోలో తొక్కిసలాటలో మృతిచెందిన కార్యకర్తలు-అండగా వుంటామని మాజీ మంత్రి కొండ మురళి**



విశాఖపట్నం, డిసెంబర్ 29, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటుంది కందుకూరు రోడ్డు షోలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారి కుటుంబాన్ని అండగా ఉంటుందని వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని మాజీ మంత్రి కొండ మురళి తెలియజేశారు. జరిగిన సంఘటన దురదృష్టాకరమని తెలుగుదేశం పార్టీ ఎలాగైనా గెలిపించుకోవాలని ఆశతోటి తాపత్రయంతో వచ్చిన కార్యకర్తలు మధ్య తొక్కిసలాట జరగడం అనేది ఊహించనీ పరిణామం అని, ఇది పోలీసుల వైఫల్యం అని, రోడ్డు షోకి సరైన మార్గ నిర్దేశం ఇవ్వకుండా అందర్నీ వదిలేయడం ద్వారా జరిగిన దురదృష్టకరమైన విషయం అని దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ తెలియజేశారు. చనిపోయిన కార్యకర్తల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ ఎల్లవేళాలా కార్యకర్తల సంక్షేమం కోరుకునేది అని ఏ కార్యకర్తలకు విషయంలో భరోసా ఇవ వ్వదని గండి బాబ్జి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 31వ వార్డు అధ్యక్షులు సారిపల్లి మహేష్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, గొంపా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చలితో వణుకుతున్న మన్యం

విశాఖపట్నం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



మన్యంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరిగింది. గత మూడు రోజులుగా ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గడంతో మన్యం వాసులు గజగజ వణుకుతున్నారు. చింతపల్లి 10, లంబసింగి 8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగ, పాడేరు, అరకులోయలో 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం పదిన్నర గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తుండగా, ఆ తరువాత నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మాత్రమే ఎండకాస్తుంది. నాలుగు గంటల నుంచి యథావిధిగా చలితీవ్రత మొదలవుతుంది. రాత్రి వేళల్లో ఇళ్లలో ఉన్నా ఆరుబయట ఉన్నట్టుగా చలి ప్రభావం చూపుతున్నది. దీంతో గిరిజనులు ఉన్ని దుస్తులు ధరించి, చలి మంటలు కాగుతూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల మరోసారి కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చింతపల్లిలో 10, లంబసింగి 8 కనిష్ట డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. నవంబరులో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 8 డిగ్రీలు నమోదైనప్పటికీ వరుస అల్పపీడనాల ప్రభావం వల్ల కనిష్ట ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపించింది. ప్రస్తుతం మరోసారి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండడంతో చలితీవ్రత పెరిగింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా చల్లగాలులు వీస్తున్నాయి. ఉదయం వేళ్లలో మంచు దట్టంగాకురుస్తుంది. ఉదయం 10గం. వరకు సూర్యుడు కనిపించడంలేదు. స్థానికులు చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్ని దుస్తులు ధరించుకుని కనిపిస్తున్నారు. నెలాఖరు నాటికి కనిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# సీఎం నర్సీపట్నం టూర్‌కు భారీ పోలీస్ బందోబస్తు

వార్త 11లో



## విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆధ్వర్యంలో కందుకూరి సభ మృతుల ఆత్మకు నివాళులు

విశాఖపట్నం, డిసెంబర్ 29, ప్రభాతవార్త



విశాఖ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు జిల్లా కందుకూరి సభలో జరిగిన విషాద సంఘటనకు చింతిస్తూ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా పార్టీ కార్యాలయంలో క్యాండిల్‌తో సంతాపం నిర్వహించారు. విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పళ్ళ శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు దువ్వవరపు రామారావు, గీతం అధినేత ఎం శ్రీభరత్, గంట నూకరాజు, రాజమండ్రి నారాయణ, కె వి స్వామి తమ్మిన విజయ్‌కుమార్ కేదారి లక్ష్మి, అనసూయ మధు, అబ్దుల్ అనీఫ్, ఉప్పిలి రామకృష్ణ కె పార్ధసారధి, లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

**మైనర్ బాలిక పట్ల జనసేన నేత రఘువరావు**

## వేధింపులపై మహిళా కమిషన్ సీరియస్

విశాఖపట్నం, డిసెంబర్ 29, ప్రభాతవార్త

మైనర్ బాలికపట్ల జనసేన నేత రఘువరావు వేధింపులపై మహిళా కమిషన్ సీరియస్ అయ్యారు. వారిని కఠిన చర్యలు చేపట్టాలని విశాఖ పోలీస్ కమిషనర్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామంటూ భరోసా జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గం నాయకుడు రాఘవరావు వేధింపుల పర్వంపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుపుకున్న చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విశాఖ నగరానికి చెందిన ఓ మైనర్ బాలిక పట్ల జనసేన నేత రాఘవరావు వేధింపులపై కఠిన చర్యులు చేపట్టాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా మిగతా11లో

## కేంద్రం అనుమతులు ఇవ్వకుండా మెడికల్ కళాశాల నిర్మాణాలు ఎలా చేస్తారు ?

**మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు**



అనకాపల్లి/నర్సీపట్నం, డిసెంబర్ 29, ప్రభాతవార్త

కేంద్రం అనుమతులు ఇవ్వకుండా మెడికల్ కళాశాల నిర్మాణాలు ఎలా చేస్తారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయలు అయ్యన్న పాత్రుడు అన్నారు. గురువారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణం చేయడం సంతోషకరమన్నారు. వాస్తవాలను చెప్పకుండా ప్రజలను మభ్యపెట్టి ఓట్లు కోసం ముఖ్యమంత్రి జగన్మోహరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. మెడికల్ కళాశాలకు తాము వ్యతిరేకం కాదని, మాకరవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల కోసం స్థలాలు ఇవ్వాలని రైతులకు సూచించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ 16 మెడికల్ కళాశాలలను మంజూరు చేస్తున్నానని, దానికి 8 వేల కోట్లు ఖర్చు అవుతుందని ప్రకటించడం జరిగిందన్నారు. ఇందులో పాడేరు పులివెందులలో మెడికల్ కళాశాలకు 2020 అక్టోబర్ 20న శంకుస్థాపన మిగతా11లో

## అల్లూరి జిల్లాలో ఈ ఏడాది 27.5కు తగ్గిన క్రైమ్ రేట్

**- జిల్లాలో 18 శాతం తగ్గిన రోడ్డు ప్రమాదాలు - 664.1 ఎకరాల్లో 31,27,500ల గంజాయి మొక్కలు ధ్వంసం - గంజాయికు 7,328 ఎకరాలలో ప్రత్యామ్నాయ పంటలు : అల్లూరి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ వెల్లడి**



పాడేరు, డిసెంబర్ 29,ప్రభాతవార్త

ఈ ఏడాది అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం క్రైమ్ రేటు 27.5 శాతం తగ్గిందని, అలాగే మానవ హత్యలు, నేరాలు సంఖ్య 24.3 శాతం గణనీయంగా తగ్గిందని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ వెల్లడించారు. అల్లూరి జిల్లా పాడేరు పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఈ సంవత్సరంలో రహదారి ప్రమాదాలు 18 శాతం తగ్గిందని దీనికి రహదారి భద్రతా చర్యలే కారణమన్నారు. అల్లూరి జిల్లాలో ఈ ఏడాది ఆరు మానవ హత్య కేసుల్లో జీవిత ఖైదీ అలాగే ఆరు అత్యాచారాలు,వరకట్న హత్య కేసులలో కఠిన కారాగార శిక్షలు విధించడం జరిగిందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది గంజాయి సంబందించి పోలీస్ మరియు సెబ్ సంయుక్తంగా 339 కేసులు నమోదు చేసి అందులో 56,255.5 కేజీలు గంజాయిని సీజ్‌చేయడం జరిగిందని ఆ కేసుల్లో 794 మంది ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాదిలో 664.1 ఎకరాల్లో 31,27,500ల గంజాయి మొక్కలను మిగతా11లో

# విదేశీపక్షులు విడిది ఆ ఉప్పుటేరు

## రాజయ్యపేటలో సందడి చేస్తున్న కొంగలు, విదేశీ పక్షులు

నక్కపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని రాజయ్యపేట గ్రామంలో సముద్రానికి ఆనుకుని ఉన్న ఉప్పుటేరు ప్రస్తుతం విదేశీ పక్షులు విడిది ఇల్లుగా మారిందనే చెప్పాలి, మన దేశీయ కొంగలతో పాటు రెక్కలు కట్టుకుని మేత కోసం వలస వచ్చిన విదేశీ పక్షులు ఉప్పుటేరులో రోజు సందడి చేస్తున్నాయి. రాజయ్యపేట గ్రామానికి,. హెటిరో ఔషధ పరిశ్రమకు మధ్యలో ఉన్న ఉప్పుటేరులో తెలుపురంగు కొంగలు, విదేశీ పక్షులతో పాటు, నలుపు, తెలుపురంగుల్లో ఉన్న మరికొన్ని పక్షులు కూడా గుంపులు, గుంపులుగా ఈ ఉప్పుటేరులో వాలిపోతున్నాయి. పంట పొలాల్లో ఆహారపు ధాన్యాలు తింటూ, మధ్యలో ఉప్పుటేరులో చిన్న చిన్న చేపలను తినేందుకు ఒకేసారి వందల సంఖ్యలో ఈ పక్షులు ఉప్పుటేరు వద్ద సందడి చేస్తూ చూసేవారికి చక్కని ఆనందాన్ని కలుగజేస్తున్నాయనే చెప్పాలి. అంతేకాకుండా ఇక్కడ అవి గుడ్లు పెట్టి పిల్లలు తయారైన తర్వాత మరల ఎండలు ప్రారంభమయ్యే సమయంలో ఇక్కడి నుంచి మరల విదేశాలకు వెళ్లిపోతాయని జువాలజీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బైక్‌లు, ఆటోలపై వెళ్లే వారు కాస్సేపు ఆగి, ఈ పక్షుల సందడిని తిలకిస్తూ, ఫోన్లలో అందాలను భద్రపర్చుకుంటున్నారు. ఇలా గురువారం కూడా పెద్ద సంఖ్యలో వలస పక్షులు రాజయ్యపేట ఉప్పుటేరు వద్ద కనిపించాయి.





# వైసీపీ పాలనతో రాష్ట్రాభివృద్ధి శూన్యం

## ఇదేం పరిపాలన... మనఖర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల



**శృంగవరపుకోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** అవినీతి, అక్రమాలు, దాడులు, విధ్వంసాలు ఇదేం పరిపాలన మనఖర్మ అంటూ రాష్ట్ర ప్రజలు ఎక్కడ చూసిన వైసీపీ ప్రభుత్వంపై మండిపడుతున్నారని ఎస్.కోట టీడీపీ పార్టీ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. గురువారం ఎస్.కోటలోని బర్మా కాలనీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల పాల్గొని ముందుగా గత టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజకీయల కతీతంగా పరిపాలన అందిస్తున్నామని వైసీపీ ప్రభుత్వం మాయ మాటలు తూటాల్లా పేలుస్తున్నారని, కానీ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని రైతు సంక్షేమ వ్యతిరేక విధానాలను అమలు చేయడం వలన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, పరిశ్రమలు లేక యువత ఉపాధికి దూరమైయ్యారని తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్రం మరో30ఏళ్ల వెనక్కి వెళ్లి పోయిందన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు వ్యతిరేకంగా వున్నారని రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం జరగాలంటే ఒక్క టిడిపి పార్టీ తోనే సాధ్యమని అందువలన రానున్న ఎన్నికల్లో టీడీపీ పార్టీని అధికారంలోకి తీసుకురావలసిన బాధ్యత మనందరిపై వుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు జిఎస్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజి, మల్లేశ్వరరావు, కిరణ్,అప్పలరాజు, చెల్లయ్య, ఆడారి రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారాది రైతు భరోసా కేంద్రాలన్ని పరిశీంచిన ఆర్‌డిఓ



**బొబ్బిలి, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** మండలంలో గోర్లెశీతారాంపురం, పారాది రైతు భరోషాకేంద్రాలను ఆర్‌డిఒ శేషశైలజా పరిశీలించారు.గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును పరిశీలించారు. మండలంలో ఇంతవరకు 8541 మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. లోకల్ మిల్లు బ్యాంకు గ్యారంటీ చెల్లించనందున ఇతర మండలాకు, తెర్లాం తదితర మండలకు ధాన్యం ట్రక్‌షీట్లు అందజేయబడుతున్నాయన్నారు. రైతులకు ఇబ్బందిగా ఉంటే వెంటనే ఇతరమండాలకు పంపిచాలని, లేని పక్షంలో లోకల్ మిల్లు బ్యాంకు గ్యారంటీ కట్టేవరకు వేచి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఎడి మజ్జి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

# మహిళలు వైకాపాను ఓడించాలి : సంధ్యారాణి



**సాలూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సభలో అపశ్రుతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, మా కుటుంబ సభ్యులైన టీడీపీ కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పోలిట్ బ్యూరో సభ్యురాలు జి.సంధ్యారాణి ఆ వేదన వ్యక్తపరిచారు. గురువారం ఉదయం పట్టణ 20 వార్డులో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భా గంగా సంధ్యారాణికి మహిళలు అడుగడుగునా హారతులతో, పూలమాలలతో, నుదుట తిలకం దిద్ది ఆశీర్వదించారు. అనంతరం మహిళలు ఆమెకు పలు సమస్యలు వివరిస్తు నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులో అశుభ్రత ఎక్కువగా ఉందని, కాలువలు శుభ్రంగా లేవని, వీధి లైట్లు సరిగ్గా పనిచేయటం లేదని తదితర సమస్యలను విన్నవించారు. సమస్యలు విన్న సంధ్యారాణి మాట్లాడుతు సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని, బాబు వస్తే జాబు వస్తుందని, అన్ని కష్టాలు తీరుతాయని మహిళలకు, స్థానికులకు భరోసా కల్పించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు చిట్టి, కౌన్సిలర్ శైలజ, కూనిశెట్టి భీమారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు పౌష్టికాహార మొక్కలు పెంచేందుకు ముందుకు రావాలి



**గరివిడి, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** మహిళా సంఘాల ప్రతినిదులు మునగ, ఇతర మొక్కలు పెంపకం ద్వారా ఆర్థిక స్వావలంభన సాధించడంతో పాటు మంచి పౌష్టికాహారాన్ని పొందాలని గరివిడి మండలా ధ్యక్షురాలు మీసాల విజయలక్ష్మి, ఎంపిపి భర్త, మాజీ ఎఎంసి ఛైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు కోరారు. మునగ మంచి పౌష్టికాహార లక్షణాలు ఉన్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ మునగ ఇరత మొక్కలు పెంచేందుకు ఉద్యుక్తులవ్వాలని వారు కోరారు. ఉపాధి హామీ పథకం నిధులతో పండించిన మునగ మొక్కల నర్సరీకి చెందిన మొక్కలను మీసాల, వాకాడలో గరివిడి మండల సమాఖ్య కార్యాలయంలో వమిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు, మునగ, ఇతర మొక్కలు పెంచేందుకు ప్రతీ ఒక్క మహిళా సంఘం ముందుకు రావాల్సిన అవశ్యకతను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఎపిఎం లోపింటి పద్మ, ఎఫ్‌పిఒ ఎపిఎం విజయలక్ష్మి, ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ వైకాపా నాయకులు వలిరెడ్డి లక్ష్మణ, గుడివాడ వెంకట శ్రీరాములు నాయుడు, నీలాద్రి సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

## - విజయవాడలో ప్రమాణస్వీకారం



**నెల్లిమర్ల, డిసెంబరు 29 ప్రభాతవార్త :** రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నెల్లిమర్లకు చెందిన నౌపడ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని ఆర్‌అండ్‌బి ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం డైరెక్టర్ శ్రీనివాసరావు కార్పొరేషన్ నూతన ఛైర్మన్ కనుమూరి సుబ్బరాజును, ఎం.డి శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఇక్కడి విలేకర్లతో మాట్లాడారు. తనకు పదవినిచ్చిన సిఎం జగన్మోహనరెడ్డికి కృతజ్ఞ తలు తెలుపుతున్నట్లు చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతను శక్తి వంచనలేకుండా నిర్వర్తిస్తానని, రాష్ట్రంలోనూ ప్రధానంగా విజయనగరం జిల్లాలోనూ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును నెల్లిమర్ల నగర పంచాయితీ వైసిపి కమిటి అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయితీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్ తదితరులు అభినందించారు.

# కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఉద్దవోలు విద్యార్థులు



**విజయనగరం, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా బలిజిపేటలో రెండు రోజుల పాటు జరిగిన జోనల్ స్థాయి క్రీడల పోటీల్లో కబడ్డీ విభాగంలో తెర్లాం మండలం ఉద్దవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను, వీరికి తర్ఫీదునిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సుంకరి కుమారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివి సంగమేశ్వరరావు అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిన్ని బహుమతులు సాధించడం ద్వారా పాఠశాల కీర్తి ప్రతిష్టలు పెంచాలని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. క్రీడా నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుందని, ఈ విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని సంగమేశ్వరరావు అన్నారు.ఈ కార్యక్రమంలో పిజికల్ డైరెక్టర్ సుంకరి కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గరుగుబిల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** పార్వతీపురం 132 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటినెన్స్ పనులు కారణంగా గరుగుబిల్లి మండలానికి సంబంధించి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్ కిషోర్ కుమార్ ,మండలవిద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బొంతాడ శంకరరావు తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదలచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మెయింటినెన్స్ పనులు కారణంగా సరఫరాను నిలుపుదలచేయనున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ట్యాబ్‌ల పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం



**పాచిపెంట, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** ప్రభుత్వ హైస్కూల్ లో విద్యా ఎనిమిదో తరగతి విద్యార్థులకు డిప్యూటీ సీఎం గిరిజన శాఖ మాత్యులు పీడిక రాజన్న దొర విద్యార్థులకు ట్యాబ్లు అందజేశారు. మండల కేంద్రమైన పాచిపెంట గిరిజన మినీ గురుకుల పాఠశాల ఆవరణలో ట్యాబులు పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్య సంస్థలకు దీటుగా ప్రభుత్వ హైస్కూల్ కళాశాలలో విద్య నభ్యసిసన్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ ఉన్నత స్థాయిలో ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన అన్నారు. వైయస్సార్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలకు అన్ని విధాలుగా వారి అవసరాలకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికి దక్కిందని ఆయన అన్నారు. అది గమనించి జగనన్నని మరిచి పోకూడదని మరచిపోకూడదని ఆయనకు గుర్తు చేశారు. ఏప్రభుత్వం చేయని విధంగా జగనన్న విద్యార్థులకు అమ్మవడి విద్యా కానుక విద్య దీవెన, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వ్యయంతో భవన నిర్మాణాలు చేపట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కొర్ర జన్ని సహాచలం, ఎంపీపీ ప్రమీల ఎంపీడీవో లక్ష్మికాంత్ మండల పరిషత్ ఉపాధ్యక్షులు కోరిపల్లి రవీంద్ర, రెండవ మండల పరిషత్ ఉపాధ్యక్షులు నారాయణమ్మ జిల్లా వైయస్సార్ పార్టీ కార్యదర్శి డోల బాబ్జి మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు గొట్టాప్ ముత్యాలయుడు ఎంపీపీ ప్రతినిధి పాచిపెంట ఎంపీటీసీ దండి ఏడుకొండలు మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ టి.గౌరీశ్వరరావు, కోటికి పెంట సర్పంచ్ ఇజ్జాడఅప్పలనాయుడు, మండల వైయస్సార్ పార్టీ నాయకులు సలాది అప్పలనాయుడు, మోసూర్ సర్పంచ్ ప్రతినిధి జి.రాము, పాచిపెంట జడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ పాంచాలి కృష్ణాజిల్లా, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ జైగురుదత్త హోమాలు



**గరుగుబిల్లి డిసెంబర్ 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం శ్రీ అనగా దేవి సహిత జై గురు దత్త హోమాలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు ఉదయం సుప్రభాత సేవ కాకడ హారతి, తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా షిరిడి సాయిబాబాకువిశేష అర్చనలు అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగకర్త అసంఖ్యాక దేవాలయాల ప్రతిష్టాపకులు ఎస్‌విఎల్‌ఎన్ శర్మ యాజి సంపూర్ణ సహాయ సహకారాలతో ఆలయ అర్చకులు నల్లకాంతం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీ అనగా దేవి సహిత జై గురుదత్త హోమములను నిర్వహించడంజరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా ఈ హోమాలు చేయించుకోవడంవల్లఈతి బాధలు తొలగడంతో పాటు మనసులోకోరిన కోర్కెలు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. ఈహోమంలో కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకుదీక్షవస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. అలాగే దాతలచే అన్నదానం కార్యక్రమమును నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

# విద్యార్థులకు డిజిటల్ విద్య : డిప్యూటీ డిఇఓ



**గజపతినగరం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** బైజూస్ కంటెంట్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ విద్య ఎంతో మేలు చేస్తుందని విజయనగరం ఉప విద్యాశాఖఅధికారి కె.వాసుదేవ రావు అన్నారు. గురువారం ఆయన స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేస్తున్న ట్యాబ్లను అలాగే ఎస్‌ఏ వన్ ప్రశ్నా పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వ 0కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని అన్నారు. జనవరి రెండో తేదీ నుంచి ఎస్‌ఏ వన్ పరీక్ష పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి బోర్డు సెక్రటరీ సన్యాసిరాజు, ఎంఈఓ ఎస్. విమలమ్మ పాల్గొన్నారు.

# పెద్దపల్లివీధిలో గడపగడపకు మన ప్రభుత్వం



**విజయనగరం కార్పొరేషన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** నగరంలోని పెద్దపల్లివీధిలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగరమేయర్ వెంపడాపు విజయలక్ష్మి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పథకాలు అమలుతీరుపై కూడా ఆరా తీశారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగితెలుసుకున్నారు. తమ ప్రాంతంలో విద్యుత్ దీపాలు లేవని, కాలువలు సక్రమంగా లేవని స్థానికులు డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకెళ్ళగా సంబంధిత అధికారులను పిలిచి సమస్యలు పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నగరమేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరువాత రాష్ట్రం స్వర్ణమయమైందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించడం దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. నవరత్నాలను శతశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దేనన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి.రాజేష్, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జిల్లా ఎస్.సి, ఎస్.టి సెల్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు బొంగు భానుమూర్తి, వార్డు కార్పొరేటర్ రేగాన రూపాదేవి, వైసిపి పార్లమెంటరీ పార్టీ ప్రదాన కార్యదర్శి ముద్దాడ మధు, పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు వెత్స శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షణ భూ పట్టాల పంపిణీ



**దత్తిరాజేరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** మండల పరిధిలో గల వంగర గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షణ పథకంలో భాగంగా రీసర్వే పూర్తి కాబడిన ఏడు గ్రామాలు లక్ష్మీపురం, దత్తి వెంకటాపురం, చెరుకుపల్లి, నీలకంఠరాజపురం, లింగరాజపురం, విశ్వేశ్వరపురం, తాడేంద్ర వలస సంబంధించి 212 భూహక్కు పత్రాలను గజపతి నగరం శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య పంపిణీ చేయడం చేశారు. అదేవిధంగా 175000తో మంజూరైన హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను, 25లక్షలతో గ్రామ సచివాలయాన్ని 218000తో రైతు భరోసా కంద్రాన్ని ఎమెల్యే బొత్స ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ప్రభోజీ, ఏఎంసి చైర్మన్ వేమలిముత్యాలనాయుడు, ఎంపిపి గెదల సింహాద్రిఅప్పలనాయుడు, జడ్పీటిసి రౌతు రాజేశ్వరి బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, మండల శ్రీనివాస్, సుమల శ్రీనువాసు, మంత్రి అప్పలనాయుడు, దన్నాన త్రినాథ్, సర్పంచ్ దత్తి నారాయనప్పలనాయుడు, ఎంపిటిసి వంగ పండు కృష్ణ మూర్తినాయుడు, దత్తి చిరంజీవి, దత్తి అప్పలనాయుడు, ఎంఆర్‌ఓ రమేష్, ఎంపిడిఓ సుబ్రహమాన్యం, మండల పరిధిలో గల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు



**గజపతినగరం,డిసెంబరు 29 ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయ పొలంలో పంట కోత ప్రయోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త స్వాతి సూచించారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన వరి పొలాన్నా ఆమె గురువారం సందర్శించి పలు అంశాలను రైతులకు వివరించారు. రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలు వేసుకుని కలియదున్ని బీజామృతంతో వరి విత్తన శుద్ధి, నారు శుద్ధి, కొసులు తుంచడం, కాలి బాటలు తీయడం, ద్రవ జీవామృతం పారించడం వంటి కషాయాలు పిచికారీ చేశారని వివరించారు. సహజంగా పురుగుల నివారణకు పక్షి స్థావరాలు, పసుపు పళ్లాలు, లింగాకర్షణ బుట్టలను పొలంలో ఏర్పాటు చేసి గట్లపై బంతి మొక్కలను నాటు కోవడం వంటి పద్ధతులను పాటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం ఎఓ ధనలక్ష్మి,విఎఎ ఉదయశ్రీ,ఎం.టి సత్యనారాయణ, ఎం.ఎ అనురాధా, సంతోషి ,రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం
విజయనగరం
వార్త
25 Glorious years
శుక్రవారం, 30 డిసెంబర్ 2022

## తారకరామతీర్ధ సాగర్ ప్రాజెక్టు

# కాలువ డిజైన్ మార్పుపై అనుమానాలు

- గుణుపూరుపేటలో ఓ ప్రైవేట్ లేఅవుట్ కోసం కాలువ మళ్లింపు
- చెరువులో కాలువ త్రవ్వకంపై రైతుల అభ్యంతరం
- అధికార పార్టీ కనుసన్నల్లోనే డిజైన్ మార్పు వ్యవహారం





**విజయనగరం రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. త్వరితగతిన ఆయా ప్రాజెక్టుల పనులు చేపట్టాలని పదేపదే అధికార యంత్రాంగాన్ని ఆదేశిస్తోంది. అయితే కొందరి స్వార్ధ ప్రయోజనాల కోసం రైతుల అశలపై నీళ్ల జల్లుతోంది. ఇందుకు అధికారపక్షం అండగా నిలుస్తోంది. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ నిర్మాణానికి డెంకాడ మండలం గుణుపూరుపేటలో బ్రేకు పడింది. తొలుత ఈ కాలువ కోసం జలవనరుల శాఖ డిజైన్ రూపొందించింది. ఈమేరకు భూసేకరణ, రైతులకు పరిహారం చెల్లింపులు జరిగాయి. కాలువ త్రవ్వకాల పనులు కూడా ఊపందుకున్నాయి. ఈ సమయంలో ఓ రియల్ ఎస్టేట్ తన వ్యాపారం కోసం కాలువ డిజైన్ మార్పు చేయాలని అధికార పార్టీ నేతలపై ఒత్తిడి తెచ్చి ఆ పార్టీ కీలక నేత సిఫార్సుతో అధికారులు కూడా కాలువ డిజైన్ మార్చేశారు. ఇవేవీ అక్కడ ప్రజలు, రైతులకు తెలియకుండా రహస్యంగా జరిగిపోయాయి. తీరా కొత్త డిజైన్ ప్రకారం అధికారుల చెరువు మధ్య నుంచి కాలువ త్రవ్వకాలకు ఉపక్రమించారు. ఇది గమనించిన రైతులు విస్తుపోయి కాలువ పనులకు అడ్డు తగిలారు. ప్రధాన జలాశయంగా పేరొందిన పెద్ద చెరువు మధ్య నుంచి కాలువ త్రవ్వితే పంటలు ఎలా పండించుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అంగీకారంతోనే కాలువ డిజైన్ మార్పు చేశామని అధికారులు చెప్పడంతో ఖంగుతిన్నారు. తమకు తెలియకుండా ఎవరు సంతకాలు పెట్టారు. రైతుల అంగీకారంతో ఎవరు దరఖాస్తు ఇచ్చారని నిలదీశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఒకటిరెండు సార్లు చెరువు ప్రాంతాన్ని, కాలువ పాత డిజైన్, కొత్త డిజైన్ కూడా పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాలువను పాత డిజైన్ ప్రకారం త్రవ్వాలని, డిజైన్ మార్చి చెరువులో కాలువ త్రవ్వకాలకు అంగీకరించబోమని రైతులు నాయకులకు తెగేసి చెప్పేశారు. ఇదిలా వుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారి తన వ్యాపారం కోసం లేఅవుట్‌ను రెండు విభాగాలుగా చేసుకుని వుడా నుంచి అనుమతి తెచ్చుకుని ఒక వైపు ప్లాట్లు విక్రయాలు చేస్తున్నారు. మరో వైపు చెరువులో కాలువ పనులు వద్దంటూ రైతులు అడ్డు పడుతున్నారు. ఇదిలా వుండగా అధికార పార్టీ, ప్రతిపక్ష నేతలెవరూ రైతుల సమస్యను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం రియల్ ఎస్టేట్‌కు కొమ్ముకాస్తుందా? రైతులకు న్యాయం చేస్తుందా వేచి చూడాలి. ఏదీ ఏమైనప్పటికీ చెరువులో కాలువ రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

# చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయి

## - జనసేన నాయకులు గురాన అయ్యలు





**విజయనగరం (ప్రభాత వార్త) :** జనసేన పార్టీలో గురాన అయ్యలు చేరిన సందర్భంగా అంజనీపుత్ర చిరంజీవి ప్రజాసేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఫ్యామిలీ అభిమానులు జి.ఎస్.ఆర్.హోటల్‌లో గురువారం గురాన అయ్యలును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. డిసెంబర్ 23, 24 తేదీల్లో వాకర్స్ ఇంటర్నేషనల్-2022 ముగింపు ఉత్సవాల్లో అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్‌కు ప్రత్యేకమైన సేవా అవార్డులు రావడంతో క్లబ్ సభ్యులకు జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు, ఆదాడ మోహన్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సేవలు అభిందనందనీయమన్నారు. తక్కువ కాలంలో ఎక్కువ సేవా కార్యక్రమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు. చేసిన సేవలే గుర్తింపునిస్తాయని, నడుస్తూ, నడిపిస్తూ ఆరోగ్యమే మహా భాగ్యమనే నినాదంతో నడిచే వాకర్స్ క్లబ్‌లన్నీ సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు (బాలు), కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, ఉపాధ్యక్షుడు లోపింటి కళ్యాణ్, సభ్యులు ముక్కి కుమార్, రెయ్యి రాజు, గుల్లపాటి మోహన్‌కుమార్, రాజేష్, పత్రి సాయి, ఎంటి రాజేష్, కందివలస సురేష్, ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ నియోజకవర్గంగా చీపురుపల్లి నిలవాలి : బొత్స



**గరివిడి, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే జగన్ సర్కార్ ధ్యేయమని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సంక్షేమ పథకాలు పొందని వారిని గుర్తించే బాధ్యత సచివాలయ కన్వీనర్లదేనని ఆయన అన్నారు. చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా విస్తృత స్థాయి సమావేశం శ్రీరాంనగర్ లయన్స్‌క్లబ్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో తొలుత స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మ ంత్రి బ్సొ సచివాలయ కన్వీనర్లు, వైకాపా కార్యకర్తలను ఉద్దేశించి ఉపన్యసించారు. ప్రతీ సచివాలయ కన్వీనర్ తమతమ పరిధిలో సంక్షేమ పథక లబ్దిదారులను గుర్తించాలన్నారు. చీపురుపల్లి నియోజకవర్గం రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలవాలని ఆయన ప్రతీ కార్యకర్త సచివాలయ కన్వీనర్ అంకిత భావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాల దశలో డిజిటల్ విద్య వైసీపీ ప్రభుత్వ ఘనత



**నెల్లిమర్ల,డిసెంబరు 29 ప్రభాతవార్త :** పాఠశాల దశలో డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టిన ఘనత సిఎం జగన్మోహనరెడ్డిదేనని జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరుచేసిన ట్యాబ్‌లను సన్యాసినాయుడు గురువారం తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సన్యాసినాయుడు మాట్లాడుతూ తమ వైసిపి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని అన్నారు. టెక్నాలజీ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ప్రధానంగా అమ్మ ఒడి, నాడు-నేడు కార్యక్రమాలు చరిత్రలో నిలచిపోతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విక్టోరియా రాణి, తుమ్మలపేట పిఎసిఎస్ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడు, వైసిపి నాయకులు బెల్లాన రామారావు, మక్కువ వెంకట రమణ, వాల్లె అప్పలనాయుడు, కురిమినెల్లి శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 31 లోగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలి



**పాచిపెంట, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
అర్హులైన రైతులకు పీఎం కిసాన్ కొరకు ఈకైవైసి డిసెంబర్ 31 ఏదీ నాటికి తప్పని సరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొల్లి తిరుపతిరావు రైతులకు తెలియ జే యాలని సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రమైన పాచిపెంట వ్యవసాయ అధికారి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయం పరిధిలోగల రైతులను పీఎ కిసాన్ కొరకు కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు అశ్రద్ధ చేయకుండా ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు. రైతులకు తెలియజేయాలని వ్యవసాయ అధికారి కే తిరుపతి రావు అన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ఇకపై ప్రతినెల పనితీరుపై సమీక్ష చేసి రిపోర్టును జిల్లా వ్యవసాయ అధికారికి అందజేయాలని ఆయన సిబ్బందికి తెలిపారు. వ్యవసాయ సంబంధి చ్చిన, ప్రభుత్వ పథకాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేసి సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇప్పటివరకు ఇంకా ఈ కేవైసీ చేసుకోలేని రైతులు ముఖ్యంగా గిరిజన రైతులు అందరికీ పీఎం కిసాన్‌కు అన ర్హులవుతారని కాబట్టి ఈ విషయం రైతులు అందరికీ తెలియజేయాలని కోరారు. పిఎం కిసాన్ రిజిస్ట్రేషన్లు చేయించుకు న్నారని కానీ ప్రతి రైతు విధిగా తమ ఫోన్ నెంబర్ను ఆధార్తో అనుసంధాన మ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు అక్కడక్కడ కత్తెర పురుగు ఆశించిందని క్షేత్ర ప్రదర్శనలు చేసి నివారణ చర్యలు కొరకు రైతులకు సూచించాలని ఇబ్బందిని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏఈఓ రెడ్డి హైమావతి, విఏఏలు పాల్గొన్నారు.

# పేకాట కేసులో 9 మందికి జైలు శిక్ష

**కురుపాం, డిసెంబర్29 ప్రభాతవర్త :**
పేకాట కేసులో 9మంది కి కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈ. ఆంజనేయులు జైల్ శిక్ష చెప్పారు. ఎల్విన్ పేట పోలీసు స్టేషన్ లో2017 లో నమోదు అయిన పేకాట కేసులో 9 మంది నేరం ఋజువైనందున ముద్దాయిలైన 9 మందికి 5 రోజులు జైలు శిక్ష, 3000రూపాయలు జరిమానా విధించారు. జరిమానా కట్టని ఎడల ఒక్కొక్క రికి రెండు వారాలు జైలు శిక్ష విధించారు. ఎపిపి కిమిడి చంద్రకుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి



**సంతకవిటి, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మందరాడలో స్వామి వివేకానంద 160వ జయంతి సంద ర్భంగా స్వామి వివేకానంద జీవిత చరిత్రపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు యోగ భారతి ట్రస్ట్ విశాఖపట్నం.వారిచే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గడే అప్పలనాయుడు. ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి 50,000, రెండవ బహుమతి 25000, 3వ బహుమతి 15000, నాలుగో బహుమతి 10000, 5వ బహుమతి 5000గా ప్రకటించడం జరిగినది. ఈ పోటీలు రాష్ట్రస్థాయిలో జరిగినప్పటికీ ఏ స్కూలుకి ఆ స్కూల్లోనే 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు నిర్వహించుకోవడం జరిగినది. ఈ పోటీలు వలన పిల్లలకు మంచి విలువలతో కూడిన విద్యను అందించవచ్చు అని పిల్లలలో సేవాభావము దేశభక్తి. మహనీయులు యొక్క త్యాగాలను ఇటువంటి వ్యాసరచన పోటీల ద్వారా పిల్లల్లో పెంపొందించవచ్చును. స్వామి వివేకానంద ప్రసిద్ధిగాంచిన హిందూ యోగి. రామకృష్ణ పరమహంస యొక్క ప్రియ శిష్యుడు వేదాంత తత్వశాస్త్రములతో సమాజము పైన అత్యంత ప్రభావం కలిగించిన ప్రముఖ ఆధ్యాత్మిక నాయకుడు. గురువుగారి కోరిక మేరకు అమెరికా వెళ్లి అక్కడ హిందూ మతం యొక్క గొప్పతనం గురించి చికాగోలో ఉపన్యాసం చేశారు. భారతదేశం యొక్క గొప్పతనం గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసిన మహనీయులు. తన వాగ్దాటికి ముగ్ధులై అమెరికా ప్రజానీకం ఆయనకు బ్రహ్మరథం పట్టినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రాకోటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంక్రాంతి ముందు ఆరోడ్డును పూర్తిచేయలేం

**బొబ్బిలి, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
సంక్రాంతి ముందు ఆరోడ్డును అందజేయలేకపోతున్నామని క్లాస్‌వన్ కాంట్రాక్టర్ శంబంగి వేణు గోపాలనాయుడు మదన పడుతున్నారు. గతపది సంవత్సరాలుగా బొబ్బిలి - బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయిన పనులు గత మూడునెలగా పునఃప్రారంబించారు. పాత గుత్తేదారు పనులు చేయడానికి నిరాకరించితే ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు చొరవతో నష్టం అని తెలిసినా మనం ఈపనిచేసి బొబ్బిలి ప్రజలకు సౌకర్యం కల్పించాలని దృడమైన అభిప్రాయంతో సోదరులు ఈపనిప్రారంభించారు. చెరవేగంగా పూర్తిచేసారు. సంక్రాంతికి ఎలా అయన పూర్తి చేయాలని నిశ్చయంతో కావులు, విద్యుత్ తదితర పనులు పూర్తిచేసారు. పైఫ్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డుపనులు పూర్తిచేయలేక పోతున్నామని ఆయన తెలియజేసారు.

# రేషన్ డిపోను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



**పాలకొండ, డిసెంబర్ 29 ప్రభాతవార్త**
పాలకొండ పట్టణం, మండలంలో పలు రేషన్ డిపోలను రెవెన్యూ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. గురువారం పట్టణంలోని స్థానిక నాగవంశపు వీధిలో వున్న ఎఫ్‌పి షాపు నెం 0112093తో పాటు మండ లంలోని తుమరాడ గ్రామ ఎఫ్‌పి షాపును తనిఖీలు నిర్వ హించారు. అక్కడి రిజిష్టర్లను పరిశీలించి స్టాకు వివరాలకు, గొడౌన్‌లో వున్న స్టాకును నిశితంగా పరిశీలించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుండి పదో తేదీ వరకు అందిస్తున్న సరుకుల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా రేషన్ లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నదీ లేనిదీ అక్కడి డీలర్లను ప్రశ్నించారు. బియ్యంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి ఒక్క సరుకును లబ్దిదారునికి చేరాలని ఆదేశించారు. అలాగే ప్రధాన మంత్రి అమ్మా యోజన కింద అందిస్తున్న ఉచిత బియ్యం పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని సూచించారు. ఫిర్యాదులు అందకూండా సక్రమంగా ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, రేషన్ డిపో డీలర్లు వున్నారు.

# పసుపు సైనికులకు అశ్రునివాళి

**పూసపాటిరేగ, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన తెలుగుదేశం పార్టీ పసుపు సైనికులకు పూసపాటిరేగ మండల టీడీపీ పార్టీ నాయకులు అశ్రునివాళి అర్పించారు. కార్యక్రమంలో పతివాడ తమ్మి నాయుడు మాట్లాడుతూ జరిగిన ఘటన చాలా బాధాకరమని మృతి చెందిన కుటుంబ సభ్యులందరికీ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్ర మంలో మండల టిడిపి అధ్యక్షులు మహంతి శంకరరావు రెల్లివలస సర్పంచ్ ప్రతినిధి ఇజ్జురోతు ఈశ్వరరావు చందక ఆనంద్ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

## - ట్రైఫాడ్ చైర్మన్ రామ్‌సిన్హా రత్వ





**సీతంపేట,ప్రభాతవార్త డిసెంబర్ 29 :**
గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు ట్రైఫాడ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ట్రైఫాడ్ చైర్మన్ రామ్‌సిన్హా అన్నారు. గురువారం సీతంపేట మన్యంలో పర్యటించిన ట్రైఫాడ్ చైర్మన్ ఐటిడిఎ పరిధిలో నిర్వహిస్తున్న విడివికేల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీడి,పసుపు,చీపుర్లు ప్రోసెసింగ్ యూనిట్లను పరిశీలించారు.ఇవి తయారుచేసే విధానాన్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అగర్‌బత్తి, బిస్కట్, తేనే చిప్స్ తయారీ యూనిట్లను కూడ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆశయానికి తగ్గట్టుగా సీతంపేటలో ప్రోసెసింగ్ యూనిట్లు ఉన్నాయన్నారు. వేరే రాష్ట్రాలకు చెందిన గిరిజను లను ఇక్కడకు తీసుకువచ్చి శిక్షణ ఇప్పిస్తామన్నారు.పైనాపిల్ జ్యూస్ ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మార్కెటింగ్ కోసం ట్రైఫాడ్ నుండి పూర్తి సహకారం అందించి, లాభాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.వీడివికేల నిర్వహణకు నిధులు వెచ్చించేందుకు జీసిసి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. దీనికి ముందు 68 వీడివికెల అభివృద్ధి, పనితీరు నివేదికను ఐటిడిఎ పీవో నవ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జీసిసి ఎండి సురేస్,ట్రైఫాడ్ ఆర్‌ఎం శ్రీనివాసరావు,జీసిసి డిఎం సంధ్యారాణి,వైకెపి ఏపిడి నారాయణరావు తదితరులు ఉన్నారు.

# కార్మికనేతల అక్రమాల భాగోతం

**విజయనగరం కార్పొరేషన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
కార్మికహక్కుల పరిరక్షణ కోసం ఎన్నో పోరాటాలు చేసి, ఎంతో ఘనచరిత్ర కలిగిన కార్మికసంఘాలు నేడు కొంతమంది నాయకుల చేతుల్లో బందీ అవుతున్నాయి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, లాభార్జన కోసం దిగజారి కార్మికులకు నమ్మకద్రోహం చేస్తున్నారని ప్రచారం విజయనగరం జిల్లాలో జరుగుతోంది. ఇందుకు ఉదాహరణగా నిన్నమొన్నటి వరకు ఒక ప్రధాన కార్మిక సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, మున్సిపల్ కార్మికసంఘానికి అధ్యక్షుడిగా, మిమ్స్ కార్మిక యూనియన్ నాయకుడిగా ఒక వెలుగు వెలిగిన ఆ నాయకుడిపై తాజాగా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఆ నాయకుడు తీరుపై కార్మికులు నిప్పులు చెరుగుతున్నారు. అలాగే ఆయన భార్య ఓ ప్రధాన కార్మికసంఘానికి అధ్యక్షురాలిగా ఉంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నిబంధనలకు విరుద్ధంగా తమ తమ్ముడు భార్యను ఆశవర్కర్‌గా నియమించుకున్నారనే ఆరోపణలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆశవర్కర్‌గా స్థానికులనే నియమించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఆ నాయకురాలి ఒత్తిడి మేరకు స్థానికేతరాలిని ఆశావర్కర్‌గా నియమించారని విమర్శలు ఉన్నాయి. గత నెల 14న ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఓ వ్యక్తి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ఇంతవరకు దీనిగురించి ఎవరు పట్టించుకోలేదు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని పోరాడుతూనే నిబంధనలకు విరుద్ధంగా తమ వారిని ఉద్యోగాల్లో నియమించుకుని స్థానికులకు అన్యాయం చేస్తున్న ఆ నాయకురాలు హవా డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యా లయంలో కొనసాగుతోంది. అదేవిధంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగిన కార్మికనాయకుడు తమ బావమరిదిని మున్సిపాలిటీలో అక్రమంగా నియమించుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ వాటర్‌వర్క్స్‌లో పనిచేసిన ఓ కార్మికుడు అనారోగ్యంతో 2011లో మరణించగా ఆయన కుమారుడు తన తండ్రి ఉద్యోగం ఇవ్వాలని మున్సిపల్ అధికారికి దరఖాస్తు పెట్టుకున్నారు. అయితే అప్పటికే ఆ పోస్టును భర్తీ చేశామని మున్సిపల్ అధికారులు చెప్పడంతో ఆ వ్యక్తి నిర్ఘాంత పోయాడు. ఆ వ్యక్తి నేటికీ మున్సిపల్ ఆఫీసుచుట్టూ ఉద్యోగం కోసం తిరుగుతూనే ఉన్నాడు. అయితే ఆ కార్మికసంఘం నాయకుడు తన బావమరిదిని వాటర్‌వర్క్స్‌లో నియమించుకోవడంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారు. ఈవిధంగా ఆ నాయకులిద్దరూ కార్మిక సంఘాలకు ద్రోహం చేస్తున్నారని విమర్శలు మాత్రం మూటగట్టుకున్నారు.

# సమన్వయంతో పని చేయాలి : పరీక్షిత్ రాజు



**కురుపాం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరిక్షిత్ రాజు అన్నారు. గురువారం కురుపాం డిగ్రీ కళాశాలలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు. వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశంలోని మంచి గుర్తింపు పొందిన ఏకైక ప్రభుత్వం అని అన్నారు. ఎప్పుడు సచివాలయంలో కన్వీనర్‌లను ఏర్పాటు చేసారని అన్నారు. వాలంటీరులు కన్వీనర్‌లు సమానంగా పని చేసి ప్రజలకు పథకాలు అందజేయాలని అన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ పాదయాత్రలో, ఎన్నికల ప్రణాళికలో రూపొందించిన హామీలు ముదున్నా రేళ్లలో 99 శాతం నెరవేర్చిన ఘనత మన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని ఆమె అన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశం కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించారన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఉప అధ్యక్షులు మరిచర్ల బాపూజీ నాయుడు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెంకటరావు, రాష్ట్ర వైశ్య సంఘము డైరెక్టర్ కొత్తకోట వెంకట సురేష్ ఉప సర్పంచ్ అదిల్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు గౌరీశంకరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొటేశ్వరరావు,మండలం ఏపీటీసీ లు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీయర్ స్వామి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలి



## - ఎమ్మెల్సీ రఘురాజు

**శృంగవరపుకోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
జీయర్ స్వామి ఆశీర్వాదం మాకు ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. గురువారం ఎస్ కోటలోని పుణ్యగిరి వద్ద ఎమ్మెల్సీ రఘురాజు ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అహోబిలం జీయర్ స్వామి సందర్శించారు.ఈసందర్భంగా ఆలయ నిర్మాణం పనులు పరిశీలించి కమిటీకి ఆయన సూచనలందించారు.అలాగే జీయర్ స్వామి మఠంకు చెందిన భక్తులు ఎంవి. రమణమూర్తిరాజు ఆలయ నిర్మాణానికి ఇచ్చిన 1,00,116/ ల చెక్కును జీయర్ స్వామి సమక్షంలో ఎమ్మెల్సీ రఘు రాజుకు అందజేశారు. ఈకార్యక్రమం అనంతరం భర్తాపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని జీయర్ స్వామి సందర్శించారు.స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగవంతుని ప్రవచనాలను చదివి భక్తులకు వినిపించారు.అలాగే జీయర్ స్వామి బొడ్డవరలో నున్న ఎమ్మెల్సీ రఘురాజు నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి ఎమ్మెల్సీ రఘురాజు, సతీమణి సుధారాజులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎస్ కోట సర్పంచ్ సంతోషి కుమారి,పలువురు ఎంపిటిసిలు, వైసీపీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరం యూత్‌పౌండేషన్ సేవలు ఆదర్శనీయం

## - ఆర్‌ఎంపిల సంఘం అధ్యక్షుడు చిరంజీవి



**విజయనగరం కార్పొరేషన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
విజయనగరం యూత్‌పౌండేషన్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గెద్ద చిరంజీవి అన్నారు. గురువారం స్థానిక శిల్పారామం కళావేదిక వద్ద ఆ సంక్షేమ సంఘం సభ్యుల ఆత్మీయ కలయిక జరిగింది. విజయనగరం యూత్‌పౌండేషన్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి పౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపిల సంఘం అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ కరోనా సమయంలో యూత్‌పౌండేషన్ చేసిన సేవలను గుర్తు చేశారు. కరోనా మృతులకు దహన సంస్కారాలు చేయడంతో పాటు ఉచిత ఆక్సిజన్ సిలెండర్ సర్వీసు, జిల్లాలో తొలి ఫుడ్‌బ్యాంక్, ఉచిత అంబులెన్స్ సేవలు, అత్యవసర రక్తదానశిబిరాలు నిర్వహించడం, పేదలకు చేయూత అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేసి ప్రజల హృదయాల్లో పౌండేషన్ సభ్యులు శాశ్వతంగా నిలిచిపోయారని చెప్పారు. ముఖ్యంగా పౌండేషన్ అధ్యక్షుడు ఇల్తామాష్ ప్రతినిత్యం చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లో కొనసాగించి నిరుపేదలకు అండగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, క్యాన్సర్ ఆసుపత్రి సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వంశీధర్ పుత్రేవు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జ్యోషి, కోట్ల పైడిరాజు, ముత్యాలరావు, రామ్మూర్తి రాజు, రమణనాయుడు, ఉమానాయుడు, విజయనగరం యూత్‌పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి



**గరుగుబిల్లి, డిసెంబర్ 25 ప్రభాతవార్త :**
మత్స్య రంగానికి ప్రోత్సహించి మత్స్య కారుల ఆర్థికాభివృద్ధి కి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీఉప ముఖ్యమంత్రి, కురుపాం ఎమ్మెల్యే పాముల.పుష్పశ్రీ వాణీ అన్నారు. జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో గురువారం తోటపల్లి ప్రాజెక్టులోచేపపిల్ల లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్య సంపద పెంపొందించడం ద్వారా మత్స్య కారుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. కోట వాని వలస, మార్కండ పుట్టి, స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు లబ్ది పొందుతున్నాయని జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల. తిరుపతయ్య తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద గతంలో మత్స్య రైతు భాగస్వామ్యంతో 40 శాతం సబ్సిడీ ద్వారా రెండు లక్షలు చేప విత్తనాలు విడుదల చేయడం జరిగిందని, ప్రస్తుతం 60 శాతం సబ్సిడీ ద్వారా 3 లక్షల చేప పిల్లల విత్తనాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. మండలం పరిషత్ అధ్యక్షులు ఉరిటి.రామారావు,ఉమ్మడి జిల్లాల జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడులు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. జిల్లా మత్స్యశాఖ వైస్ ప్రెసిడెంట్ దాసరి లక్ష్మణరావు, ఎఫ్ డి ఓ టి.నాగమణి, కోటవాని వలస, మార్కొండ పుట్టి సంఘ అధ్యక్షులు ఈదల తిరుపతి, మరుముల్ల శ్రీనివాసరావు, గ్రామ మత్స్య సహాయకులు నందివాడ.శ్రీకాంత్ ,ప్రదీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సారికలో 3,600 ఇళ్ల పట్టాల పంపిణీ



**విజయనగరం రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
సొంత ఇళ్లు కట్టుకోవాలన్న పేదల కలలను ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. విజయనగరం మండలం సారికలో గృహనిర్మాణ లేఅవుట్‌లో, సుమారు 3,600 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకొని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేరుస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే ముఖ్యమంత్రి ఆదేశం మేరకు రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీని ప్రారంభించామని అన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, దేశంలో మరెక్కడా లేని విధంగా, మన రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను, రాష్ట్ర ప్రభు త్వం పేదలకు పంపిణీ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో అతిపెద్ద లేఅవుట్‌లో ఒకదాన్ని గుంకలాంలో రూపొందించి, ముఖ్యమంత్రి చేతులమీదుగా పట్టాలను పంపిణీ చేశామన్నారు. సారికవద్ద సుమారు 120 ఎకరాల్లో, 4 వేల ప్లాట్లతో మరో లేఅవుట్‌ను రూపొందించామని చెప్పారు. ఒక్కో పేద కుటుంబానికి సుమారు రూ.6లక్షల విలువైన స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతోపాటు, వారు ఇళ్లు కట్టుకోడానికి రూ.లక్షా, 80వేల ఆర్థిక సాయాన్ని, ఉచితంగా ఇసుకను కూడా అందించడం జరుగుతోందని చెప్పారు.సభకు అధ్యక్షతన వహించిన ఎంపిపి మామిడి అప్పలనాయుడు, విజయ నగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, డిప్యుటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, హౌసింగ్ పిడి ఎస్‌వి రమణమూర్తి, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, తాశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఎంపిడిఓ జి.వెంకటరావు, ఇతర మండల స్థాయి అధికారులు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఫెన్షన్ తొలగిస్తే జగన్ ప్రభుత్వం ఫినిష్ : రేగు



**సాలూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభు త్వంలో పేద ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పి సామాజిక పింఛన్ల తొలగించే నిమిత్తం నోటీసులు జారీ చేస్తున్న వైకాపా తీరును పట్టణ జనసేన నాయకులు రేగు.మహేశ్వర రావు తీవ్రంగా వ్యతిరేకించారు. గురువారం ఆయన వాట్సాప్ ద్వారా స్థానిక విలేకరులకు ఒక ప్రకటన ద్వారా తెలియజేసిన వివరాలు ఇలాఉన్నాయి. ప్రతినెల ఒం టరి మహిళలకు, వితంతువులకు, వృద్ధులకు, దివ్యాం గులకు ఇస్తున్న పింఛన్లు తగ్గించే నెపంతో రాష్ట్ర ప్రభు త్వం చేస్తున్న కసరత్తు ప్రారంభించడంతో పేదలు ఇబ్బం దులు పడుతున్నారన్నారు. విద్యుత్ బిల్లు, ఇంటి విస్తీర్ణ సాకులతో ఫెన్షన్లు తొలగించేందుకు చూపించిన కారణాలు సహేతుకంగా లేవన్నారు. అందువలన ఇలాంటి నిర్ణయాలు ప్రభుత్వం ఆపాలని వెంటనే పెన్షన్స్ ఆగిన పేదలకు పునరుద్ధ రించాలని, ఎప్పటిలా లబ్ధిదారులు అందరికి పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నూర్పు యంత్రం బోల్తా పడి ఇద్దరు మహిళలకు గాయాలు



**వీరఘట్టం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
మండలం రేగులపాడు గ్రామానికి చెందిన కడగల కంచమ్మ పార్వతీలకు గురు వారం నూర్పు యంత్రం బోల్తా పడడంతో గాయాలయ్యాయి. పొలం పనులు ముగించు కుని అదేయంత్రంపై గృహాలకు చేరుకునేం దుకు యంత్రంపై ఎక్కి వస్తుండగా పొలం గట్టు వద్ద యంత్రం బోల్తా పడడంతో యంత్రం ఆ ఇద్దరు మహిళలపై పడిపోయింది. దీంతోవారికి గాయాలు కావడంతో సహచరులు 108కు సమా చారం అందించడంతో 108 వాహ నం ప్రమాద స్థలానికి చేరుకుని గాయపడిన మహిళకు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

# కందుకూరు సంఘటన దురదృష్టకరం

## - సంతాపం తెలియజేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక



**పాలకొండ, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
కందుకూరులో జరిగిన విషాద సంఘటన దురదృష్టకరమని ప్రతి ఒక్కరి మృతికి తన సంతాపాన్ని తెలయజేస్తున్నట్టు పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయక్రిష్ణ తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాల యంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ దురదృష్ట సంఘటనపై టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ప్రతి కుటుంబాన్ని ఆదుకుని తమ టిడిపి కుటుంబానికి అండగా నిలిచార న్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మే 30 2019తేదీన ముఖ్యమంత్రి వైఎస్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులకు, నిర్లక్షానికి, వివక్షకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోయాయని, ప్రతి ఏడాది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మోసపూరితమైన హామీ నిచ్చి నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడేశారన్నారు. గతంలో తెదాపా హయంలో ఇచ్చిన 3వేల రూపాయల నిరుద్యోగబృతిని కూడా రద్దుచేశారన్నారు. ప్రభుత్వ విధానాలతో 4రోజులకొక నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, ప్రతి 8గంటలకు ఒక మహిళ లైంగిక వేధింపులకు గురికావడం జరుగుతుందని, రాష్ట్రంలో డ్రగ్స్, మద్యం విక్రయాలు జరుగుతున్నాయని విమర్శిం చారు. ఈ సందర్భంగా నారాలోకేష్‌బాబు చేపట్ట యువగళం దకార్యక్రమం వందకు పైగా నియోజక వర్గాల్లో సాగుతుందని, జనవరి 27నుండి లోకేష్ పాదయాత్ర చేస్తున్నట్టు, ప్రతి ఒక్కరు కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలన్నారు. యువగళం కార్యక్రమంలో ప్రతి ఒక్క టిడిపి యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఇదేం ఖర్మ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్య లపై టిడిపి పోరాటానికి దిగిందన్నారు. కార్యక్రమంలో మండల, టౌన్ అధ్యక్షులు గండి రామినాయుడు, గంటా సంతోష్, బిసి సెల్ కార్యదర్శి కిమిడి కాశినాయుడు, సర్పంచ్ సిరిపురపు జగదీష్, కోట సంగం నాయుడు, దాలినాయుడు, కౌన్సిలర్ ప్రతినిధి పడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌ట్రా తూనికలు కొలిస్తే చర్యలు : సబ్ కలెక్టర్




**వీరఘట్టం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
తూనికల్లో ఎక్స్‌ట్రా ధాన్యం కొలిస్తే సంబం ధిత వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పాలకొండ సబ్ కలెక్టర్ నూరూల్‌కుమార్ గ్రామీణ వ్యవసాయ సహాయకులకు హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ వ్యవసాయ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 80 కేజీల 180 గ్రాములు ధాన్యం మాత్రమే తూనికలు వేయాలని అధికంగా ధాన్యాలు కొలిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోనే కొన్ని గ్రామాల నుంచి నిర్ణీత కొలతల కంటే అధికంగా ధాన్యం తూనికలు వేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అది మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వాహనాలు రప్పించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉన్న మేరకు ఎక్కడ కుప్పలు లేకుండా రైతులు ముమ్మరంగా నూర్పులుచేసే విధంగా దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.మన్మధరావు, వ్యవసాయ విస్తరణాధికారి బి.కృష్ణకాంత్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను తనిఖీ చేసిన సిఎస్‌డిటి



**వంగర, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
వంగర సిఎస్‌డిటి బలివాడ గోవింద రావు గురువారం వంగర మండల కేంద్రంలో రైస్ మిల్లు ను తనిఖీ చేశారు. రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం పట్ల మిల్లర్స్‌తో మాట్లాడారు. అనంతరం ధాన్యం నిల్వలు, రైస్ బస్తాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలవకుండా వచ్చిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు మిల్లర్స్ దిగుమతి చేయాలని ఆదేశించారు. తదుపరి వంగర పి ఎ సిస్ కార్యాలయంలో రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న గోనెసంచులు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు ఎన్ని సరఫరా చేశారన్న వాటిపై రికార్డును పరిశీలించారు.

# 'కస్టడీ' రిలీజ్ డేట్ ఫిక్స్..



అక్కినేని నాగచైతన్య, వెంకట్ ప్రభు క్రేజీ కాంబినేషన్‌లో రూపొందు తున్న ప్రతిష్టాత్మక తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'కస్టడీ'.. ఈచిత్రంలో నాగచైతన్య సరసన కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీనివాస సిల్వర్‌స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసచిట్టూరి భారీగా నిర్మిస్తున్నారు. ఈచిత్రాన్ని పవన్ కుమార్ సమర్పిస్తున్నారు.. నాగచైతన్య పుట్టినరోజుసందర్భంగా రిలీజ్ డేట్‌ను లాక్ చేశారు. సెలవులను సద్వినియాగం చేసు కునేలా ఈచిత్రాన్ని వచ్చే ఏడాది మే12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్న ట్టు మేకర్స్ ప్రకటించారు.. ఈచిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. ఇళయరాజా, యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.. అబ్బూరి రవి డైలాగులు అందించారు..

# న్యూ ఇయర్ ట్రీట్..




పాన్‌ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ తన అద్భుత మైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేసు కున్నారు.. ఆయన తాజాగా తెలుగు ఓటిటి మాధ్యంలో నట సింహ బాలకృష్ణ హోస్ట్‌చేస్తున్న అన్‌స్టాపబుల్‌లో పార్టిసిపేట్ చేసిన సంగతి తెలిసిందే.. ఇటీవల ఈ ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమోను విడుదల చేశారు.. దీంతో ప్రభాస్ అందరి దృష్టిని ఆకర్షించారు.. ఆహా ఈ బాహుబలి ఎపిసోడ్‌ను రెండు భాగాలుగా ప్రేక్షకులను అందిం చాలని నిర్ణయించింది..ఇది అభిమానులకు నిజంగా పండగ లాంటిదే.. బాహుబలి -అన్‌స్టాపబుల్ 2 విత్ ఎన్‌బికె 1 ది బిగినింగ్ ఈనెల 30న కొత్త ఏడాది ట్రీట్‌గా ప్రసారం చేస్తున్నట్టు తెలిపారు. అలాగే 2భాగం కంన్‌క్లూజన్ జనవరి 6న ప్రసారం కానుందని తెలిపారు.




# 'కళ్యాణం కమనీయం' నుంచి మరో పాట



యువ హీరో సంతోష్ శోభన్ నటిస్తున్న తాజా చిత్రం కళ్యాణం కమనీయం.. ఈ చిత్రంలో కోలీవుడ్ తార ప్రియ భవానీ శంకర్ నాయికగా నటిస్తోంది.. ఈచిత్రంతో ఆమె టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది.. ఈచిత్రాన్ని యూవీకాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తోంది.. పెళ్లి నేపథ్యం తోసాగే ఆహ్లాదకర కథతో నూతన దర్శకుడు అనిల్ కుమార్ ఆళ్లరూపొం దిస్తున్నారు.. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.. తాజా ఈచిత్రం నుంచి హో ఎగిరే. అనే లిరికల్ పాటను విడుదలచేశారు.. ఈపాటకు కృష్ణకాంత్ సాహత్యం అందించారు. ఇటీవల విడుదలైన ఈచిత్రం టైటిల్ మోషన్ పోస్టర్, ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది.. యూవీ కాన్సెప్ట్ నుంచి మరో కంప్లీట్ ఫ్యామిలీఎంటర్ టైనర్ రాబోతోంది.. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



# పూనకాలు లోడింగ్...

మెగాస్టార్ చిరంజీవి,మాస్ మహారాజా రవితేజ పాత్రలను పరిచయంచేస్తూ వాల్తేరు వీరయ్య మేకర్స్ రెండు విభిన్నమైన ప్రోమోలను విడుదల చేశారు.. టీమ్ ఇప్పటి వరకు విడుదల చేసిన మూడు పాటల్లోనూ మెగాస్టార్ చిరంజీవి అలరించారు. ఇపుడుమాస్ మూలవిరాట్ మెగాస్టార్ చిరంజీవి, మాస్‌మహారాజా రవితేజలను కలిసి చూసే సమయం వచ్చింది.. చిరంజీవి, రవితేజ కలిసి నటించిన పూనకాలు లోడింగ్ సాంగ్‌ను డిసెంబర్ 30న విడుదల చేయనున్నారు. రెండు రోజుల ముందుగానే వారు న్యూ ఇయర్ గిఫ్ట్‌ను అందిస్తున్నారు. అనౌన్స్ మెంట్ పోస్టర్ పూనకాలు తెప్పించేస్తోంది.. అందులో చిరంజీవి, రవితేజ ఒకరినొకరు ఫెరోషియస్‌గా చూస్తున్నారు.. బ్యాగ్రౌండ్‌లో జాతర వాతావరణం కన్పిస్తోంది.. ఈచిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. చిరంజీవి సరసన శ్రుతిహాసన్ నటిస్తోంది.. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.. జనవరి 13న ఈచిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

# సోనూసూద్ హై యాక్షన్ థ్రిల్లర్ 'ఫతే'





సోనూసూద్ ఈ పేరు వింటే సామాన్యుడి పెదవిపై చిరునవ్వు విర బూస్తుంది. కరోనా సమయం లోఎందరికో సహాయ, సేవా కార్యక్రమాలన నిర్వహిం చిన గొప్ప నటుడు. కాగా వచ్చే ఏడాది లో ఆయన ఓ శక్తివంతమైన సబ్జెక్టుతో హై యాక్షన్ థ్రిల్లర్ ఫతే తో రాబోతున్నారు.. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది జనవరిలో సెట్స్‌పైకి వెళ్లనుంది. అత్యంత ప్రతాఇభా వంతమైన యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొంద నున్న ఈచిత్రాన్ని ఢిల్లీ, పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో భారీస్థాయిలో చిత్రీకరించ నున్నారు.. సోనూసూద్ మాట్లాడుతూ, ఈ యాక్షన్ థ్రిల్లర్ కథ విన్నపుడు నాకు చాలా థ్రిల్ అన్పించిందన్నారు. ఈసినిమాను 2023 లో ప్రారంభిస్తామని తెలిపారు. సోనూసూద్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. వైభవ్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు.. జీ స్టూడియోస్, శక్తి సాగర్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి..

# 'రైటర్ పద్మభూషణ్' రిలీజ్ డేట్



చాయ్ బిస్కెట్‌లోయూట్యూబ్ వీడియోలతో తన నటనా జీవితాన్ని ప్రారంభించిన సుహాస్, అద్భుతమైన ప్రతిభ గల నటుడిగా వైవిధ్యమైన పాత్రలు, చిత్రాలతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. కలర్ ఫోటో సినిమాలో అద్భుతమైన నటన కనబరిచ్చారు. ఈ చిత్రం జాతీయ అవార్డును కూడ అందు కున్న సంగతివిదితమే.. కాగా హిట్ 2లో అందరినీ ఆశ్చర్యపరిచాడు.. హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న తన తాజా చిత్రం రైటర్ పద్మభూషణ్‌లో స్ట్రగులింగ్ రైటర్‌గా కన్పించనున్నారు.. ఈసినిమా థియేట్రికల్ విడుదల తేదీని ప్రకటించారు.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న థియేటర్లలోకి రానుంది.. ఈసందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లోజీవితంలో పెద్ద లక్ష్యాలను కలిగి యునన సాధారణ యువకుడిగా కన్పించాడు సుహాస్.. విజయవాడ నేపథ్యంలో సాగే ఈచిత్రంలో టీనా శిల్పరాజ్ హీరోయిన్‌గా నటిస్తోంది.. లహరి ఫిల్మ్స్ తో కలిసి చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది.. నూతన దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. అనురాగ్, శరత్, చంద్రు, మనోహర్ నిర్మిస్తున్నారు. మనోహర్ గోవిందస్వామి సమర్పిస్తున్నారు.

# మీకు కష్టం వస్తే నాఇంటి తలుపు తట్టండి: చిరంజీవి



చిత్రపురికాలనీలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఘనంగా జరిగింది. మెగాస్టార్ చిరంజీవి, తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, నిర్మాతలు సి.కల్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు అనిల్ కుమార్ వల్లభనేని, ఎఫ్‌డిసి చైర్మన్ అనిల్ కూర్మాచలం,ఫిల్మ్‌ఛాంబర్ ప్రెసిడెంట్ బసిరెడ్డి, మణికొండ మునిసిపల్ నేతలు పాల్గొన్నారు..చిత్రపురిలో 1,176 ఎంఐజి, 180 హెచ్‌ఐజీ డూప్లెక్స్ ఫ్లాట్స్ ఓనర్స్‌కు చిరంజీవి చేతులమీదుగా ఇంటి తాళలు అందజేశారు. అనంతరం తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ మాట్లాడారు.. తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందన్నారు. సినీరంగానికి , ఇక్కడి కార్మికులకు ఎపుడూ అండగానే ఉంటుందన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వారికి ఇళ్ల నిర్మాణం చేసిన కమిటీకి అభినందనలు అని తెలిపారు. కాలనీ లో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. చిరంజీవి మాట్లాడుతూ, సొంత ఇంటి కలను మనసినీ కార్మిక సోదరులకు నిజం చేసిన ఈచిత్రపురి కమిటీకి అభినందనలు అని చెప్పారు.. ఈ సమయంలో మనం గుర్తుంచుకోవాల్సింది దివంగత నటుడు ఎం. ప్రభాకరరెడ్డిగారిని అని అన్నారు. ఆయన దూర దృష్టితో ఈ సొసైటీ కోసం చేసిన కృషి ప్రశంసనీయం అన్నారు.



ఆయన కల ఇవాళ నెరవేరిందనానరు.. దాసరి, రాఘ వేంద్రరావు, భరద్వాజ వంటి అందరూ దీన్నొక అద్భుతమైన సొసైటీగా తీర్చిదిద్దారని అన్నారు. దేశంలో మరే చిత్ర సీమలోనూ సినిమా కార్మికులకు ఇంత పెద్ద గృహసముదాయం లేదన్నారు. చిత్ర పరిశ్రమ నాకెంతో ఇచ్చిందని, అందులో నుంచి నా వంతుగా సినీ కార్మికులకు , కళాకారులకు సాయం చేస్తానన్నారు. నేను ఎదిగానని పెద్దరికం చేయాలని లేదు, సినీ కార్మికులకు తానె ప్పుడూ అండగా ఉంటానని అన్నారు. అవసరం వచ్చిన పుడల్లా మీ వెంట ఉండేది నేనే అన్నారు. మీకు కష్టం వస్తే నా ఇంటి తలుపు తట్టండి అని అన్నారు. కార్యక్రమంలో మణికొండ మునిసిపల్ చైర్మన్ కస్తూరి నరేంద్ర, వైస్‌చైర్మన్ నరేంద్రరెడి , కౌన్సిలర్లు వల్లభనేని హైమాంజలి అనిల్ కుమార్, వసంత్‌రావు చౌహాన్, శ్రీమతి సంయుక్త ప్రభాకర్ రెడ్డి, చిత్రపురి కమిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్ యాదవ్, సెక్రటరీ దొర, ట్రెజరర్ లలిత, సభ్యులు డాక్టర్ అళహరి వీవీ ప్రసాదరావు, బత్తుల రఘు, కొంగర రామకృష్ణ, దీప్తి వాజ్‌పాయ్, అనిత నమ్మగడ్డ,

# అడివి శేష్ మూవీ 'జి2'



ప్రముఖ నటుడు అడివిశేష్.. కథల ఎంపికలో ప్రేక్షకుల్లో ఒక కల్ట్ ఫాలోయింగ్ సంపాదించారు. గూఢచారి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఒక పాత్ బ్రేకింగ్ మూవీ.. ఈచిత్రానికి శశితిక్క దర్శకత్వం వహించారు. వీరి రెండోకలయికలోపాన్ ఇండియా ప్రాజెక్టుగా మేజర్ చిత్రం చేశారు. ఈచిత్రం పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.. మేజర్‌తో దేశవ్యాప్తంగా పాపులర్ అయిన శేష్ తన తాజా తెలుగు సినిమా హిట్2 తోమరో బ్లాక్‌బస్టర్ అందించారు. కాగా అడివి శేష్ తన పాత్ బ్రేకింగ్ మూవీ గూఢాచారి సీక్వెల్‌ను జి2 పేరుతో తదుపరి ప్రాజెక్టుగా ప్రకటించారు.. జి2 టీం ప్రీవిజన్ వీడియోను జనవరి 9న ఢిల్లీ, ముంబై, రెండింటిలో ఒకే రోజు విడుదల చేయనుంది.. మేజర్ సినిమా ఎడిటర్ వినయ్ కుమార్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.. శేష్ స్వయంగా కథ రాశారు.. ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా ప్రాజెక్టుని మూడు ప్రముఖ ప్రొడక్షన్ హౌస్‌లు కలిసి నిర్మిస్తున్నాయి.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ ఇండియా ప్రై.లి బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.. మేకర్స్ ఈసందర్భంగా కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు.

**యంగ్ లవ్లీ హీరో ఆది సాయికుమార్ ప్రస్తుతం టాప్‌గేర్ సినిమాలో ప్రేక్షకులముందుకు రాబోతు న్నారు.. ఈచిత్రం శ్రీధర్‌రెడ్డి నిర్మాణసారధ్యంలో తెరకెక్కింది.. ఆదిత్య మూవీస్, ఎంటర్‌టైన్ మెంట్స్ సమర్పణలో శ్రీధనలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈసినిమాకు కె.శశికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు.. ఈచిత్రం డిసెంబర్ 30న విడుదల కానుంది.. ఈసందర్భంగా నిర్మాత శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే. .**

# కంటెంట్ మీదున్న నమ్మకంతో సినిమా తీశాం



టాప్ గేర్ సినిమా చాలా బాగుండబోతోంది.. ఈసినిమాతో ఆది సాయికుమార్‌కు వచ్చే ఏడాది శుభారంభం కానుంది. ఆది మంచి డ్యాన్సర్, మంచి నటుడు టాప్‌గేర్ సినిమాతో వచ్చే ఏడాది ఆయన దశ మారుతుంది.. మంచి కథ విన్నపుడు అది మనల్ని హాంట్ చేయాలి.. శశికాంత్ ఈ కథ చెప్పిన తర్వాత నాకు చాలా నచ్చింది. ఈ కథ విన్న తర్వాత ఆది అయితే బాగుంటుందని మేం అనుకున్నాం. వెళ్లి కథ చెప్పాం. ఆయన ఓకే అన్నారు.. ఈచిత్రాన్ని డైరెక్టర్ అద్భుతంగా తీశారు. ఇందులో స్క్రీన్‌ప్లే హైలెట్ అవుతుంది.. నెక్స్ట్ సీన్ ఏంటి? అనే ఆసక్తిని రేకెత్తించేలా సినిమాను తీశారు.. ఈసినిమాకు అసలు హీరోసంగీత దర్శకుడు హర్షవర్ధన్,ఆర్ఆర్.. ఇలాంటి సినిమాలకు హర్షవర్ధన్ మ్యూజిక్ ఆర్ఆర్ ప్లస్ అవుతుంది. ముందు అనుకున్న బడ్జెట్ కంటే కాస్త పెరిగింది.. క్వాలిటీ కోసం ఖర్చుపెట్టాం.. సినిమాను చూశాక ఆడియెన్స్ కూడ అదే మాట చెబుతారు.. కంటెంట్ మీదునన నమ్మకంతోనే సినిమాను తీశాం.. నాకున్న పరిచయాలతో సినిమాను సేఫ్ ప్రాజెక్టుగా మార్చగలను. కథ విషయానికొస్తే క్యాబ్ డ్రైవర్‌లకు కస్టమర్లతో కూడ సమస్యలు వస్తుంటాయి.. అలా అనుకోకుండా హీరో ఓ సమస్యలో చిక్కుకుంటాడు.. దాన్నుంచి ఎలా బయటపడతాడు అనేది కథ.. తన భారయను కాపాడుకునేందుకు హీరో చేసే ప్రయత్నాలు బాగుంటాయి. ఇక సినీ నిర్మాణం గురించి అయితే ప్రతిదీ నిర్మాతలకు ఛాలెంజింగ్‌గానే ఉంటుంది.. సినిమాను ప్రారంభించటం పూర్తి చేయటం, రిలీజ్ చేయటం అన్నీ సవాళ్లే. మనకు సినిమాలంటే ఇష్టం ప్యాషన్ కాబట్టిచేస్తుంటాం.. వాటిని ఎదుర్కోగలను అనే ధైర్యం ఉంటేనే ఇందులోకి రావాలి.. మా సినిమా అదు భతంగా వచ్చింది. మా చిత్రం మీద నాకు నమ్మకం ఉంది.

